క్లుప్తంగా

జాయింట్ సెక్రటరీగా మల్లికార్జున



బొమ్మనహాళ్: మండలంలో ఎంఈఓ–2గా పనిచేస్తున్న మల్లికార్జున ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఆదివారం ఏలూరు జిల్లాలో రాష్ట్ర కార్యవర్గం ఏర్పడింది. ఈ సందర్భంగా జాయింట్ సెక్రటరీగా మల్లికార్జున ఎన్నుకున్నారు.

నిజాయితీ చాటుకున్న కండక్టర్



బాధితురాలికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఆర్టీసీ కండక్టర్, సిబ్బంది

కళ్యాణదుర్గం రూరల్: దొరికిన సెల్‌ఫోన్ బాధితురాలికి అందజేసి ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ చాటుకున్నారు. వివరాలు.. పావగడ నుంచి కళ్యాణదుర్గానికి ఆదివారం ఆర్టీసీ బస్సు బయలుదేరింది. బస్సులో ప్రయాణిస్తున్న లక్ష్మీదేవి కంబదూరులో దిగింది. రూ.20 వేలు విలువ చేసే ఫోన్ కనపడక పోవడంతో వెంటనే కళ్యాణదుర్గం ఆర్‌టీసీ హెల్ప్ లైన్ నంబర్‌కు సమాచారం అందించింది. అధికారుల సూచన మేరకు ఆమె వెంటనే కళ్యాణదుర్గానికి వెళ్లింది. అక్కడ బస్సు కండక్టర్ వెంకటేశులు దగ్గర సెల్‌ఫోన్ ఉందని ఆమె తెలుసుకుంది. కంట్రోలర్ మూర్తి, బాలరాజు సమక్షంలో బాధితురాలికి ఫోన్ అందించారు. ఈసందర్భంగా ఆర్టీసీ అధికారులకు బాధితురాలు కృతజ్ఞతలు తెలిపింది.

వృద్ధురాలి ఆత్మహత్య



సుంకమ్మ(ఫైల్)

బెళుగుప్ప: మండలంలోని నక్కపల్లికి చెందిన వృద్ధురాలు సుంకమ్మ(62) పంటలకు పిచికారీ చేసే పురుగుల మందు తాగి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సుంకమ్మ గత కొన్ని నెలలుగా తీవ్ర కడుపునొప్పితో పాటు అధిక రక్తపోటుతో బాధపడుతుండేది. బాధను భరించలేక ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందును తాగి అపస్మారక స్థితిలోకి చేరుకుంది. కుటుంబసభ్యులు వెంటనే ఆమెను బెళుగుప్పకు తీసుకువచ్చి ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. అనంతరం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి కుమారులు వీరారెడ్డి, మల్లారెడ్డి, కుమార్తె జయసుధ ధున్నారు. కుమారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఏఎస్‌ఐ రామదాసు తెలిపారు.

శభాష్ వలంటీర్!



తిరుపతిలోని బర్డ్స్ ఆస్పత్రిలో లబ్ధిదారుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ త్రివేణి

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు గ్రామానికి చెందిన కె. దేవన్న కిడ్నీ సంబంధిత వ్యాధితో వారం రోజుల నుంచి తిరుపతిలోని బర్డ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ త్రివేణి 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆస్పత్రికి చేరుకుని రూ.10 వేల పింఛన్ సొమ్మును లబ్ధిదారునికి అందజేసింది. దీంతో త్రివేణిని గ్రామస్తులు అభినందిస్తూ శభాష్ వలంటీర్ అని ప్రశంసించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నయాపైసా లంచం లేకుండా లబ్ధిదారులకు నేరుగా సంక్షేమ పథకాలు అందుతున్నాయడానికి ఈ ఘటన నిదర్శనమని గ్రామస్తులు చర్చించుకోవడం విశేషం.

ఘనంగా కంకాలమ్మ విగ్రహ ప్రతిష్ట పూజలు



కంకాలమ్మ విగ్రహాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు

బెళుగుప్ప: మండలంలోని బెళుగుప్ప తండాలో ఆదివారం కంకాలమ్మ అమ్మ విగ్రహ ప్రతిష్ట పూజలను ఘనంగా నిర్వహించారు. గిరిజన తెగలు ఆరాధ్య దైవంగా భావించే కంకాలమ్మ అమ్మవారి దేవాలయాన్ని గ్రామంలో ఇటీవల నిర్మించారు. విగ్రహ ప్రతిష్ట పూజల్లో భాగంగా ఉదయం నుంచి హోమాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో మంగళవాయిద్యాల నడుమ ట్రాక్టర్‌లో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. సోమవారం బ్రహ్మ ముహూర్తంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట చేస్తామని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఎస్‌ఎస్ రామునాయక్, గోవిందునాయక్, రామానాయక్, లక్ష్మానాయక్, తిప్పేస్వామినాయక్, శ్రీనివాసనాయక్, పాండురంగనాయక్, నాగరాజునాయక్, మన్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలన పూర్తి

- 2.74 లక్షల ఇళ్లలో స్పెషల్ డ్రైవ్
- తప్పుల్లేని ఓటరు జాబితాకు అధికారుల కృషి




ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి

రాయదుర్గం: భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తప్పుల్లేని ఓటర్ల జాబితా సిద్ధం చేసేలా జూలై 1 నుంచి ఆగస్టు 25 వరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో ఇంటింటా నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో వంద శాతం పరిశీలించేలా అధికారులు, బీఎల్‌ఓలు కృషి చేశారు. మూడు నియోజకవర్గాల్లోనూ 813 పోలింగ్ బూత్‌లు, 6,93,460 ఓటర్లు ఉన్నారు. 2,74,224 కుటుంబాలు ఉండగా, 56 రోజుల్లో ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా పరిశీలన ప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపట్టారు. ఇందులో ఫారం–7 ద్వారా 10,441 ఓట్లు తొలగించేందుకు బీఎల్‌ఓలు గుర్తించగా, పునఃపరిశీలన కోసం కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. తద్వారా వాటిపై మరోసారి క్షేత్రస్థాయి విచారణకు అధికారులు సిద్ధమయ్యారు. ఫారం–6 ద్వారా 8,503 మంది కొత్త ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఫారం–8 ద్వారా 12,224 మంది చేర్పులు, మార్పుల కోసం దరఖాస్తు చేశారు.

16,354 డూప్లికేట్ ఓట్లు గుర్తింపు

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 2017–18 మధ్య కాలంలో టీడీపీ నాయకులు అడ్డగోలుగా చేర్పిన 16,354 డూప్లికేట్ ఓట్లను అధికారులు గుర్తించి జాబితా నుంచి తొలగించారు. ఒకరికి ఒకే ఓటు ఉండాలనే నిబంధన అమల్లోకి రావడంతో ఇన్నాళ్లు గుట్టుగా సాగిన డబుల్ ఎంట్రీల డ్రామా రట్టును అధికారులు బహిర్గతం చేస్తున్నారు.



ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీలు, డబుల్ ఫోటోలు, శాశ్వత వలసలు, మృతులను గుర్తిస్తూ జాబితా నుంచి తొలగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. 2024 సాధారణ ఎన్నికల్లో తప్పుల్లేని జాబితా సిద్ధం కానుంది.

ఓటర్ల వివరాలిలా

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓటర్లు	ఫారం-6 దరఖాస్తులు	ఫారం-7 దరఖాస్తులు	ఫారం-8 దరఖాస్తులు
రాయదుర్గం	291	2,54,392	3062	1424	4190
కళ్యాణదుర్గం	261	2,23,587	3676	7920	2875
ఉరవకొండ	259	2,15,481	1765	1126	3029

పారదర్శకంగా పూర్తి చేశాం



ఎన్నికల కమిషన్, కలెక్టర్ ఆదేశాల మేరకు 56 రోజుల పాటు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ఓటరు పరిశీలన ప్రక్రియ పూర్తి పారదర్శకంగా చేపట్టాం. ఫారం–6, ఫారం–7, ఫారం–8 ద్వారా వచ్చిన దరఖాస్తులపై క్షుణ్ణంగా అధ్యాయం జరిపి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఏ నిర్ణయమైనా.. వారి ఆదేశాలకు అనుగుణంగా పాటిస్తున్నాం. తప్పుల్లేని జాబితా తయారు కావాలన్నదే లక్ష్యం.

– సుజాత, ఈడీటీ, రాయదుర్గం

దొంగ ఓట్ల పాపం టీడీపీదే..



ప్రజాబలం కోల్పోయిన టీడీపీ 2019 ఎన్నికల్లో అడ్డదారిలో గట్టెక్కాలనే నీచ ఆలోచనతో దొంగ ఓట్లకు తెరలేపింది. చంద్రబాబు దొంగ ఓట్ల భాగోతంపై వైఎస్సార్‌సీపీ నాయకులు సీఈసీకి కూడా ఫిర్యాదు చేశారు. పారదర్శక ఓటర్ల జాబితా సిద్ధం చేయాలన్నదే మాపార్టీ సిద్ధాంతం. 2024 ఎన్నికల్లో టీడీపీని నామరూపాల్లేకుండా బంగాళాఖాతంలో కలిపేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారు.

– కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

పారదర్శకతకు పెద్దపీట



రీవెరిఫికేషన్‌లో పాల్గొన్న స్పెషల్ ఆఫీసర్ నీలమయ్య

రాయదుర్గం: తప్పుల్లేని ఓటర్ల జాబితా తయారు కోసం పారదర్శకతకు పెద్దపీట వేశామని నియోజకవర్గ ప్రత్యేకాధికారి నీలమయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని 181, 213, 217, 239 పోలింగ్ బూత్‌ల పరిధిలోని డబుల్ ఎంట్రీలు, డెత్, వలస ఓటర్లపై తహసీల్దార్ మారుతి, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఈడీటీ సుజాత ఆధ్వర్యంలో రీ వెరిఫికేషన్ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడారు.. నెల రోజుల పాటు బీఎల్‌ఓలు ఇంటింటా సర్వే నిర్వహించి తొలగింపు కోసం కొన్ని ఓట్లను గుర్తించి నివేదిక సమర్పించారన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మరోసారి వాటిపై విచారణ చేపట్టేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఒక వ్యక్తికి ఒక చోట మాత్రమే ఓటు ఉండాలనేది కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలని గుర్తు చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తప్పుల్లేని ఓటరు జాబితా తయారీపై చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపాల్ శెట్టి కృషి మరువలేనిది



తిరుపాల్‌శెట్టి చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా చాబాల తిరుపాల్‌శెట్టి పార్టీ బలోపేతానికి చేసిన కృషి మరువలేనిదని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో తిరుపాల్‌శెట్టి వైకుంఠ సమారాధన కార్యక్రమం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ అభ్యున్నతి కోసం తిరుపాల్‌శెట్టి ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహులు, టౌన్‌బ్యాంకు అధ్యక్షుడు సాధు కుళ్లాయిస్వామి, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, జెడ్పీ మాజీ సభ్యులు తిప్పయ్య, చేనేత విభాగం నాయకులు చెంగలమహేశ్వర, వడ్డే అంజినేయులు పాల్గొన్నారు.

రహదారి పనులు నాణ్యతతో చేపట్టాలి



వెలిగొండ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ, పార్టీ నాయకులు

ఉరవకొండ: మండలంలోని ఉరవకొండ–వెలిగొండ రహదారి నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని వైస్ ఎంపీపీ నరసింహులు, పెన్నహోబిలం ఆలయ మాజీ చైర్మన్ అశోక్, జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య, పార్టీ నాయకుడు వడ్డే ఆంజనేయులు సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఉపాధి పథకం నిధులు రూ.1.85 కోట్లతో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం వారు పరిశీలించారు. వైస్ ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా వెలిగొండకు రోడ్డు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే విశ్వ చొరవతో గ్రామానికి రోడ్డు మంజూరైందన్నారు. రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేసి మాజీ ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు.

బొజ్జ గణపయ్యలే జీవనాధారం!



వినాయక విగ్రహానికి మెరుగులు దిద్దుతున్న రమేష్

కూడేరు: బొజ్జ గణపయ్య ఓ రైతు కుటుంబానికి జీవనాధారమయ్యాడు. వివరాలు.. కూడేరుకు చెందిన కుమ్మర రమేష్ కుటుంబానికి నాలుగు ఎకరాల భూమి ఉంది. కొన్నేళ్ల క్రితం వర్షాభావంతో పంటలు పండక పెట్టుబడులు తిరిగిరాక అప్పుల పాలయ్యాడు. ఆ సమయంలో జీవనాధారం కోసం వినాయక చవితికి గణపతి విగ్రహాలు తయారు చేసి విక్రయాలు చేపట్టాడు. విగ్రహాల తయారీ లాభసాటిగా ఉండడంతో ఏటా కొనసాగిస్తున్నాడు. జనవరి నుంచి ఆగస్టు వరకు విగ్రహాలు తయారీలో నిమగ్నమవుతాడు. ఈ ఏడాది బెంగళూరు నుంచి అచ్చులు, విగ్రహాల తయారీకి మెటీరియల్ తెచ్చి సుమారు 150 విగ్రహాలు కుటుంబ సభ్యులతో కలసి తయారు చేశాడు. సుమారు రూ.6 లక్షలు పెట్టుబడి పెట్టి 3 అడుగులు నుంచి 13 అడుగుల వరకూ విగ్రహాలు తయారు చేశామని రమేష్ తెలిపాడు.తయారు చేసిన విగ్రహాలను కంబదూరు, కళ్యాణదుర్గం, అనంతపురంలోని పగల్ రోడ్డులో ఉంచి విక్రయిస్తానన్నాడు. 3 అడుగులవి రూ.3500, 10 అడుగులవి రూ.15 వేలు,13 అడుగుల విగ్రహాలు రూ.20 వేల చొప్పున ధరలు నిర్ణయించామన్నారు.

మల్లేశ్వరస్వామి ఆలయంలో ఎలుగుబంటి

కంబదూరు: మండల కేంద్రంలోని మల్లేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి ఓ ఎలుగు బంటి సంచరించింది. ఆలయ ప్రాంగణంలోని సీసీ కెమెరాల్లో ఎలుగు బంటి సంచరించిన సంఘటన నిక్షిప్తమైంది. ఆదివారం ఉదయం పూజారులు సీసీ కెమెరాలను పరిశీలించగా ఎలుగు బంటి సంచరించిన విషయం బయటపడింది.ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. భక్తులు రాత్రి పూట ఆలయానికి వెళ్లడానికి జంకుతున్నారు. ఆలయ సమీపంలో ముళ్ల పొదలు, చెరువు, కొండ ఉండడంతో తరచూ ఎలుగుబంట్లు సంచరిస్తున్నట్లు స్థానికులు వాపోయారు. అటవీ శాఖ అధికారులు ఎలుగు బంట్ల సంచారాన్ని అరికట్టాలని భక్తులు, స్థానికులు కోరారు.



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

● పూర్వ విద్యార్థుల కలయిక

కణేకల్లు: మండలంలోని యర్రగుంట జెడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు సరదాగా గడిపారు. 1998–99 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమానికి విచ్చేశారు. టీచర్స్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతోపాటు వివిధ వృత్తుల్లో పని చేసుకుటూ ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా కార్యక్రమానికి హాజరై అందరూ సంతోషంగా గడిపారు. 25 ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకోవడంతో.. అప్పటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అనంతరం అప్పటి గురువులైన శ్రీనివాసులు, మద్రేగౌడ్, షాక్షావలీ, జగదీష్, ఆనంద్‌ను సన్మానించారు.

ఈ–క్రాప్ నమోదు వంద శాతం చేపట్టాలి



రాయదుర్గం రూరల్: ఈ–క్రాప్ నమోదును పర్యవేక్షిస్తున్న ఏడీఏ లక్ష్మానాయక్



కూడేరు: ఇప్పేరులో పంటల నమోదు చేపడుతున్న వ్యవసాయాధికారులు

రాయదుర్గం: గడువులోగా ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి పారదర్శకంగా చేపట్టాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సంబంధిత అధికారులకు ఫోన్ కాన్ఫరెన్స్ ద్వారా ఆదివారం ఆదేశించారు. ఈ సందర్భంగా విప్ కాపు మాట్లాడారు. ఖరీఫ్‌లో సాగైన పంటలన్నీ వంద శాతం ఈ–క్రాప్ నమోదు కిందకు తీసుకురావాలన్నారు. అర్హత కలిగిన ప్రతి రైతుకు తప్పక న్యాయం చేకూర్చే బాధ్యత తీసుకోవాలన్నారు. ఏమాత్రం పొరపాట్లకు తావిచ్చిన బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా కొన్ని పంటలు ఎండిపోతున్నాయని, అలాంటి వారందరికీ పంటల బీమా పథకం వర్తించేలా చర్యలు చేపట్టాలన్నారు. పంట ఏదైనా సరే నష్టపోతే పరిహారం అందించే బాధ్యత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్నారని గుర్తుచేశారు. గత టీడీపీ హయాంలోలాగా రైతులను వంచనకు గురిచేసే నైజం తమ పార్టీకి లేదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు రైతుల గురించి మాట్లాడే అర్హత లేదని ఈ సందర్భంగా మండిపడ్డారు.

15లోగా క్రాప్ నమోదు చేసుకోండి

రాయదుర్గం రూరల్: ఖరీఫ్ లో పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా ఈనెల 15లోగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏడీఏ లక్ష్మానాయక్ సూచించారు. మండలంలోని 74 ఉడేగోళంలో చేస్తున్న ఈ–క్రాప్ నమోదును ఆయన ఏఓ మహేంద్రతో కలసి ఆయన ఆదివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్బీకే సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. రాయదుర్గం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 56,215 హెక్టార్లలో పంటలు సాగుచేయగా ఇప్పటి వరకు 22,162 హెక్టార్లలో కేవలం 39 శాతం మాత్రమే ఈ–క్రాప్ నమోదు చేశారన్నారు. అనంతరం మామిడి, చీనీ, దానిమ్మ, టెంకాయ తదితర ఉద్యాన పంట పొలాలను సందర్శించి, రైతులతో మాట్లాడారు. అలాగే రైతులు ప్రత్యామ్నాయ పంట సాగు చేయడానికి విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

కూడేరు: మండల వ్యాప్తంగా ఖరీఫ్‌లో సాగైన వివిధ రకాల పంటలను 1703 మంది రైతులకు సంబంధించి 7309 ఎకరాల విస్తీర్ణంలో ఈ–క్రాప్ నమోదు చేసినట్లు ఏఓ విజయకుమార్ తెలిపారు.ఆదివారం సెలవు దినమైనప్పటికీ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వ్యవసాయాధికారులు, సిబ్బంది పంటల నమోదును వేగవంతం చేశారు. ఏఓ మాట్లాడుతూ ఈ నెల 15లోపు రైతులు ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శైలజ, వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా ప్రభుత్వ కార్యాలయాలు



బేలోడు గ్రామంలో నిర్మాణం పూర్తయిన గ్రామ సచివాలయం, ఆర్బీకే



గుమ్మఘట్ట మండల కేంద్రంలో ప్రారంభానికి సిద్ధంగా రైతు భరోసా కేంద్రం

గుమ్మఘట్ట: మండలంలోని బేలోడులో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, మండల కేంద్రంలో నిర్మించిన ఆర్బీకే ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ఒక్కో గ్రామ పంచాయతీలో కోటి రూపాయల వ్యయంతో గ్రామ సచివాలయాలు, ఆర్బీకే విలేజ్ హెల్త్ సెంటర్ తదితర ప్రభుత్వ భవనాలను నిర్మిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారు. త్వరలోనే ఆయా భవనాలను ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. మిగిలిన గ్రామాల్లో సైతం సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. టీడీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించేలా నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అహర్నిశలూ శ్రమిస్తున్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చూసి టీడీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. నిత్యం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విషం కక్కుతూ ప్రజల్లో చులకనవుతున్నారు.

కణేకల్లులో భారీ వర్షం

కణేకల్లు: కణేకల్లులో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కణేకల్లు, కె.కొత్తపల్లి, సొల్లాపురం, మాల్యం, ఎస్.హనుమాపురం తదితర గ్రామాల్లో వర్షం పడింది. గత కొన్ని రోజుల నుంచి వానజాడ లేక ఆందోళన చెందుతున్న తరుణంలో ఈ వర్షం రైతుల్లో సంతోషాన్ని నింపింది. హెచ్చెల్సీ ఆయకట్టులో వరి నాటుతున్న రైతులు కూడా వర్షం రాకతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మార్సీ పైకప్పనకు మరమ్మతులు చేపట్టండి



ఎమ్మార్సీ పైకప్ప నుంచి పెచ్చులూడిన దృశ్యం

కూడేరు: స్థానిక ఎమ్మార్సీ భవనం పాతబడడంతో పైకప్పు దెబ్బతిని పెచ్చులూడి కింద పడుతున్నాయి. దీంతో సిబ్బంది భయాందోళన చెందుతున్నారు.ఇప్పటికే పలుమార్లు సిబ్బంది పక్కన పెచ్చులు పడడంతో ప్రమాదం తప్పింది. చిన్నపాటి వర్షం వచ్చినా వర్షం నీరు కిందకి దిగుతోంది. ఉన్నతాధికారులు స్పందించి భవనం పైకప్పుకు మరమ్మతులు చేయించాలని సిబ్బంది కోరుతున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన

కూడేరు: కేంద్రం ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపుతోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమూర్తి ఖండి పడ్డారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలు, రైతులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన బిల్లులపై సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. వ్యతిరేక బిల్లులకు సంబంధించిన జీఓలను తగలబెట్టారు. నిత్యావసరాల ధరలను నియంత్రించడంలో కేంద్రం విఫలమైందన్నారు. విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఉపాధి పథకం ద్వారా కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల నేతలు వెంకటేశులు, కర్రెన్న, మల్లికార్జున,ఈశ్వరయ్య,శంకరయ్య, చిదంబరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు పంచాయతీ సమావేశం

ఉరవకొండ: స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ సాధారణ సమావేశం సోమవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఈఓ గౌస్‌సాహెబ్ ఆదివారం తెలిపారు. సర్పంచ్ మీనుగ లలితమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి వార్డు సభ్యులు తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.